సాక్షి శ్రీకాకుళం

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



వత్సవలస పిలుస్తోంది

వత్సవలస జాతరకు వేళయ్యింది. నేటి నుంచి జాతర ప్రారంభం కానుంది.

- 8లో



సాగుకు సలహా సూచనలు

వ్యవసాయ సలహా బోర్డు సమావేశం జరిగింది. సాగుపై పలువురు సలహాలు అందజేశారు.

- 8లో

వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల కోసం 27న గ్రీవెన్స్‌డే

అరసవల్లి: జిల్లాలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు, పరిష్కరించేందుకు గాను ఈనెల 27న స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలియజేశారు. పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగులంతా తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకురావచ్చునని ఆమె తెలిపారు.

న్యూస్‌రీల్

'సాంకేతిక అంశాలపై పట్టు అవసరం'

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక అంశాలపై పట్టు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. మార్చి 5, 6 తేదీల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న వైబ్రంట్ విస్తా టెక్నికల్ స్టూడెంట్ ఫెస్ట్ పోస్టర్‌ను ఆమె తన చాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో గల ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అంశాలు, పరిశోధన అంశాలతో కూడిన విజ్ఞాన మార్పిడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, సెమినార్ కన్వీనర్లు టి.భవాని, డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

'ఆ కోళ్లకు కొక్కెర తెగులు'



మృత్యువాత పడిన కోడికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యుడు

సారవకోట: మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలో పెంపుడు కోళ్లు కొక్కెర తెగులుతో మృత్యువాత పడుతున్నాయని చీడిపూడి పశు వైద్యులు చల్లా కిషోర్ శుక్రవారం నిర్ధారించారు. శుక్రవారం ఆయన మృత్యువాత పడిన కోడికి పోస్టుమార్టం నిర్వహించి వ్యాధి రావడానికి గల కారణాలు పరిశీలించారు. కొక్కెర తెగులుతో మృత్యువాత చెందుతున్నట్లు గుర్తించారు. దీనికి లసోట వ్యాక్సిన్ ఇస్తే వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. ఆయనతో పాటు వీహెచ్‌ఏ రవికుమార్ సాహు ఉన్నారు.

దరఖాస్తు చేసేందుకు గడువు పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థలో 2024–2025 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఇంగ్లిష్ మాధ్యమం)లో ప్రవేశానికి దరఖాస్తు చేసేందుకు ఈ నెల 28 వరకు గడువు పొడిగించినట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బాలాజీ తెలిపారు. సంబంధిత దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేయవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన వారికి మార్చి పదో తేదీన ఉదయం 5వ తరగతికి, మధ్యాహ్నం ఇంటర్ వారికి ఎంట్రన్స్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

'27న సదస్సుకు హాజరు కావాలి'

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా ఈ నెల 27న మంగళగిరిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరగనుందని, కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రధాన నా యకులు పాల్గొనాలని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కోరారు. గుంటూరు మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, నియోజకవర్గ ఎన్నికల బూత్ ఇన్‌చార్జిలు, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ పరిశీలకులు, జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్లు హా జరు కావాలని కోరారు. అలాగే వీరిని ఆయా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు తీసుకునిరావాలని తెలిపారు. ఎన్నికల ముందు జరిగే ఈ కీలక సమావేశానికి ఆహ్వానితులు అంతా విధిగా హాజరు కావాలని కృష్ణదాస్ కోరారు.

ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో 22 అమృత్ స్టేషన్లు



భువనేశ్వర్: ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో కొత్తగా 22 అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల నిర్మాణానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26న శంకుస్థాపన చేస్తారని జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం తెలిపారు. మంజూరైన రూ.790 కోట్లు వెచ్చించి ఈ స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా స్టేషన్ల సౌకర్యాలను మెరుగుపరిచి ప్రయాణికులకు ప్రయాణం మరింత సౌకర్యవంతం చేయనున్నట్లు వివరించారు. కొత్త అమృత్ భారత్ స్టేషన్ల జాబితాలో నౌపడ, సింహాచలం, బొబ్బిలి, శ్రీకాకుళం రోడ్, పార్వతీపురం, చీపురుపల్లి, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ రోడ్, టిట్లాగఢ్, కెసింగ, రాయగడ, పర్లాకిమిడి, కొరాపుట్, జయపురం, తాల్చేర్, రఘునాథ్‌పూర్, పారాదీప్, కెందుఝొరా గొడా, భద్రక్, అరకు, కొత్తవలస, ఇచ్ఛాపురం ఉన్నట్లు పేర్కొన్నారు.

అంతా భ్రాంతియేనా..

- టీడీపీలో గందరగోళం
- టికెట్లపై స్పష్టత లేక సతమతం
- లోకేష్ పర్యటన అట్టర్ ఫ్లాప్ కావడంతో నాయకుల్లో ఆందోళన
- టికెట్ దక్కకపోతే పరిస్థితి ఏమిటని అంతర్మథనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో టీడీపీ నాయకుల పరిస్థితి ఎటూ తేలడం లేదు. అటు లోకేష్ పర్యటన ఫ్లాపై, ఇటు టికెట్లపై స్పష్టత కరువై గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు పార్టీ కార్యక్రమాల కోసం డబ్బులు లాగేస్తున్నారు. మరోవైపు టిక్కెట్ కోసం కోట్లు అడుగుతున్నారు. ఇంత చేసినా చివరికి టిక్కెట్ వస్తుందో లేదో తెలియని దుస్థితిలో ఆశావహులు ఉన్నారు. గెలుపోటములు పక్కన పెడితే కనీసం పోటీ చేయగలిగితే నియోజకవర్గ నాయకుడిగానైనా కొనసాగవచ్చనే అభిప్రాయంతో ఉన్నారు. కానీ వారి ఆశలపై నీళ్లు జల్లేలా పొత్తు రాజకీయాలు నడుస్తున్నాయి. బయటికి చెప్పలేక, లోలోపల మింగలేక సతమతమవుతున్నారు. జిల్లాలో పలాస, నరసన్నపేట, పాతపట్నం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో టీడీపీలో టిక్కెట్ పోరు నడుస్తోంది. ఇచ్ఛాపురంలో ఆశావహులున్నప్పటికీ ముందు చెప్పిన ఐదు నియోజకవర్గాలంత తీవ్రత లేదు. కానీ ఆ ఐదు నియోజకవర్గాల్లో టిక్కెట్ ఇస్తామంటూ ఇరువర్గాలను అధిష్టానం పెద్దలు వాడేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల కోసం భారీగా ఖర్చు పెట్టిస్తున్నారు. ఇంకోవైపు టిక్కెట్ కోసం రూ.కోట్లు, ఎన్నికల కోసం మరికొన్ని రూ.కోట్లు సిద్ధం చేసుకోవాలని సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పటికే చేతి చమురు భారీగా వదిలించుకున్నారు. ఎన్నికల కోసం మరింత భారీగా ఖర్చు పెట్టాలని మానసికంగా ప్రిపేర్ చేశారు. అయితే, అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ఆడుతున్న డబుల్ గేమ్‌లో ఎవరికి టిక్కెట్ ఉంటుందో, ఎవరికీ ఉండదో చెప్పలేని పరిస్థితుల్లో నాయకులు ఉన్నారు.

పొలిటికల్ టాక్



గాలితీసిన లోకేష్ పర్యటన

ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహించిన శంఖారావం కార్యక్రమానికి ఆశావహులు భారీగానే ఖర్చు పెట్టారు. తమ బలం చూపించుకోవడానికి పెద్ద ఎత్తున ప్రయత్నించారు. జనాలను తీసుకొచ్చేందుకు డబ్బు, మద్యం పంపిణీ చేశారు. సభలకు వచ్చేందుకు గాను వాహనాలు, భోజనాలు పెట్టారు. ఎంత చేసినా లోకేష్ సభలకు జనస్పందన లేదు. నియోజకవర్గ స్థాయి నాయకుడు నిర్వహించే సభలకు వచ్చిన జనాలు కూడా లోకేష్ సభలకు రాలేదు. వచ్చిన జనాలు కూడా నిలవలేదు. లోకేష్ ప్రసంగాలకు ముందే వెనుదిరిగారు. దీంతో జిల్లాలో దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ లోకేష్ సభలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. తమ పార్టీ బలం పెరిగిందనుకుంటే ఇలా అయిందేంటని ఆ పార్టీ నాయకులు తలలు పట్టుకున్నారు. లోకేష్ పర్యటనతో పరిస్థితి మెరుగు పడుతుందని భావిస్తే అందుకు భిన్నంగా గాలి తీసేసిందని అంతర్మథనంలో పడ్డారు.

లోపాయికారీ ప్రయత్నాలు.. టెన్షన్‌లో నాయకులు..

ఏదోలా లోకేష్ పర్యటన ముగిసిందనుకుని ఆశావహులు ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. పోటీ చేస్తే కనీసం నియోజకవర్గ నాయకుడిగానైనా కొనసాగొచ్చనే ఉద్దేశంతో టిక్కెట్ వేటలో నిమగ్నమయ్యారు. పలాసలో గౌతు శిరీష, జుత్తు తాతారావు, వజ్జ బాబురావుతో పాటు ఒక వైద్యుడు టిక్కెట్ రేసులో ఉన్నారు. నరసన్నపేటలో బగ్గు రమణమూర్తి, డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు పోటీ పడుతున్నారు. శ్రీకాకుళంలో గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్ ఆశిస్తున్నారు. పాతపట్నంలో కలమట వెంకటరమణ, మామిడి గోవిందరావుతో పాటు కొందరు కొత్త వ్యక్తులు లోపాయికారీగా ప్రయత్నిస్తున్నారు. ఎచ్చెర్లలో కిమిడి కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు పోటీ పడుతున్నారు. అయితే అధిష్టానం ఎప్పటికీ క్లారిటీ ఇవ్వడం లేదు. మధ్యలో పొత్తులు రంగ ప్రవేశం చేశాయి. ఒకవైపు జనసేన రెండు చోట్ల పోటీ చేయాలని ఆరాటపడుతుండగా, బీజేపీతో కుదిరితే జిల్లాలో ఒకచోట పోటీ చేయాలని ఆ పార్టీ చూస్తోంది. ఈ లెక్కన మూడు నియోజకవర్గాలను టీడీపీ వదులుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎచ్చెర్లలో జనసేన నుంచి విశ్వక్‌సేన్, శ్రీకాకుళం లేదా పలాస నుంచి డాక్టర్ దానేటి శ్రీధర్, పాతపట్నం నుంచి గేదెల చైతన్య టిక్కెట్ ఆశిస్తున్నారు. పొత్తులో భాగంగా ఆ నియోజకవర్గాలను వదులుకుంటే ఆశలు పెట్టుకున్న నాయకులంతా ఉసూరుమనాల్సిందే. ఇప్పుడే టెన్షన్‌లో నాయకులంతా ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో ఎన్నికల జోష్



- సిద్ధం సభలతో స్పీడ్ పెంచిన పార్టీ
- బూత్ కమిటీల నియామకంతో ముందడుగు
- తాజాగా నియోజకవర్గాలకు పరిశీలకుల నియామకం
- విజయమే లక్ష్యంగా ముందుకు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్‌సీపీ ఎన్నికల కదన రంగంలోకి దిగింది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మొదలైంది. మరోవైపు సిద్ధం సభలతో జోష్ పెంచింది. రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే బూత్ స్థాయిలో కమిటీలు పూర్తి చేసింది. తాజాగా నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పరిశీలకుల జాబితాను పార్టీ అధిష్టానం విడుదల చేసింది. ఒక్కో నియోజకవర్గానికి ఒక్కొక్క పరిశీలకుడ్ని నియమించింది.

నియోజకవర్గం	పరిశీలకుని పేరు
ఇచ్ఛాపురం	చింతాడ రవికుమార్
పలాస	గొండు కృష్ణమూర్తి
పాతపట్నం	కరిమి రాజేశ్వరరావు
శ్రీకాకుళం	మామిడి శ్రీకాంత్
నరసన్నపేట	హెచ్.వెంకటరావు
ఆమదాలవలస	మెంటాడ పద్మావతి
ఎచ్చెర్ల	అంధవరపు సూరిబాబు

'ఎక్కువ కేసులు రాజీ చేయాలి'



వీసీలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయాధికారులందరూ మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో జిల్లాలోని న్యాయాధికారులందరితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోక్ అదాలత్‌పై ముందుగానే సంబంధిత పోలీసు అధికారులు ఎక్సైజ్ అధికారులు రెవెన్యూ అధికారులు లేబర్ డిపార్టుమెంటు అన్ని డిపార్టుమెంట్‌ల అధికారులతో సమావేశాలు నిర్వహించి రాజీ పడదగ్గ కేసులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, రాజాం సీనియర్ సివిల్ జడ్జ్ బాబు, సోంపేట సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్షకు సర్వ సన్నద్ధం

- జిల్లాలో 82 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 24,500 మంది అభ్యర్థులు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 25న జరగనున్న గ్రూప్–2 పరీక్షల నిర్వహణ సన్నద్ధతపై ఆయన శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. లైజన్ ఆఫీసర్లుగా సీనియర్ జిల్లా అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమయ పాలన పాటించి నిర్దేశిత సూచనలు విధిగా పాటించాలన్నారు. మెటీరియల్ తీసుకువెళ్లే వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. లైజన్ అధికారులు మెటీరియల్ తీసుకువెళ్లిన సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ కాజల్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను వివరించారు. పరీక్ష సమయాల్లో జిరాక్స్ షాపులు మూసివేయాలన్నారు.

పరీక్షలకు 24,500 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. మొత్తం 82 పరీక్ష కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి లైజన్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్, రూట్ ఆఫీసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి 1 గంట వరకు జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను, అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా దూర ప్రాంతాల నుంచి సరిపడా ఆర్టీసీ బస్సులు నడపాలని సంబంధిత ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలని, ఎవరికి అప్పగించిన విధులు వారు బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ముందుగానే సిటింగ్ ఏర్పాట్లు, వెలుతురు ఉందా లేదా చూడాలని దీనిపై చీఫ్ సూపరింటెండెంట్లు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీ నుంచి సహాయ కార్యదర్శి వసంత కుమార్ మాట్లాడుతూ జిల్లా ట్రెజరీలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశామని, రూట్ ఆఫీసర్స్ ఉదయం 5:30 కి హాజరై మెటీరియల్ తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్‌కు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన పలు అంశాలు వివరించారు.

సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డీఎస్పీ శృతి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు భాస్కరరావు, జిల్లా అధికారులు ఏపీసీ జయ ప్రకాష్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకట్ రామన్, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, డీపీఓ వేంకటేశ్వర వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.మీనాక్షి, సెట్విస్ సీఈఓ ప్రసాదరావు, ఎస్‌వైకే యూత్ కోఆర్డినేటర్ ఉజ్వల్, సూపరింటెండెంట్ రామారావు, క్రాంతి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 83 కేంద్రాలు కేటాయింపు
- నేడు సీఎస్‌లు, డీఓలతో పరీక్షల నిర్వహణపై కీలక సమావేశం



శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మార్చి ఒకటి నుంచి ఇంటర్ పబ్లిక్ (థియరీ) పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. ప్రశ్న పత్రాలు పోలీసు పహారా నడుమ జిల్లాకు చేరుకుంటున్నాయి. వీటిని మరో రెండు రోజుల్లో 33 స్టోరేజ్ పాయింట్లలో పోలీసు బందోబస్తు నడుమ భద్రపర్చనున్నారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ కోట ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ సభ్యులు బి.శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్–ఆమదాలవలస), జి.సింహాచలం (ప్రిన్సిపాల్–రణస్థలం), కె.తవిటినాయుడు (ప్రిన్సిపాల్–కొయ్యాం) ఏర్పాట్లలో పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టమెంటల్ అధికారులు, అలాగే కస్టోడియన్లు, స్క్వాడ్‌లను నియమించారు. వీరితో కీలకమైన సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని గాయత్రి కళాశాల వేదికగా ఉదయం 9.30 గంటల నుంచి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

83 కేంద్రాలు.. 45,702 మంది విద్యార్థులు

ఇంటర్మీడియెట్ పరీక్షలకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 83 కేంద్రాలను కేటాయించారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలే అత్యధికంగా ఉన్నాయి. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 45,702 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 43,071 మంది, ఒకేషనల్ 2,631 మంది ఉన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 19,937 మంది, ద్వితీయ సంవత్సరం 25,765 ఉన్నారు. 83 పరీక్ష కేంద్రాలకు 83 మంది చొప్పున సీఎస్‌లు, డీఓలను నియమించారు. 33 మంది కస్టోడియన్లను నియమించారు. 4 సిట్టింగ్, 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 1600 మంది వరకు ఇన్విజిలేటర్లను వినియోగిస్తున్నారు.

పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో కలిపి 1480 సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు. అటు ఇంటర్మీడియెట్ బోర్డు రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులు నిరంతరం వీటిని పర్యవేక్షించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ తో పాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. అన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఫర్నీచర్ ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.6.69 లక్షలు



నీలమణి దుర్గ ఆలయంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ కానుకల ద్వారా రూ.6,69,238 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. 45 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఆలయ హుండీని శుక్రవారం లెక్కించామని, అలాగే మార్కెట్ ఎదురుగా ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం హుండీ కానుకల ద్వారా రూ.1,21,941 ఆదాయం లభించిందన్నారు. 11 నెలలకు గాను ఆదాయం వచ్చిందన్నారు. శ్రీకాకుళం సహాయ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షకులు జీవీబీఎస్ రవికుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. లెక్కింపులో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నేతాజీ, కృష్ణారావు, సుదర్శనరావు, అర్చకులు రమణా చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీముఖలింగం అభివృద్ధికి రూ. కోటి మంజూరు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో వసతులు సమకూర్చేందుకు రూ. కోటి మంజూరైనట్లు ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ పథకంలో ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో యాత్రికుల విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు తదితరవి ఏర్పాటు చేయనున్నామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నెరవేరిన పురుషోత్తపురం కల

- ప్రారంభానికి సిద్ధమైన పీహెచ్‌సీ
- ఫలించిన స్థలదాత కేవీజీ ప్రయత్నం
- పీహెచ్‌సీ మంజూరులో స్పీకర్ తమ్మినేని చొరవ

ఇది కదా.. అభివృద్ధి



ప్రారంభానికి సిద్ధమైన పురుషోత్తపురం పీహెచ్‌సీ

సరుబుజ్జిలి: పురుషోత్తపురం అనే ఊరు ముప్పై ఏళ్లుగా కంటున్న కల నేటికి నెరవేరింది. పురుషోత్తపురం, ఫకీర్‌సాహెబ్‌పేట, అలమాజీపేట, పాలవలస, రావివలస, కొండవలస, పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల ప్రజలు మూడు దశాబ్దాలుగా కోరుతున్న కోరిక ఈనాటికి సిద్ధించింది. ప్రభుత్వ వైద్య సేవలు పొందాలంటే ఈ గ్రామాల ప్రజలు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చేది. దీంతో అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆఖరుకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకోవాలన్నా అంతదూరం వ్యయ ప్రయాసలకు గురై ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇన్నాళ్లకు ఈ ఊరిలో పీహెచ్‌సీ ఏర్పాటైంది. కేవీజీ సత్యనారాయణ దాతృత్వం, స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవ, వైఎస్సార్ సీపీ సర్కారు ఉదారత కలగలిపి పురుషోత్తపురం కల నెరవేరింది.

గ్రామంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కేవీజీ సత్యనారాయణ తన మండల పరిషత్ పదవీ కాలంలో తీవ్రంగా కృషి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతో పురుషోత్తపురం గ్రామానికి నూతన పీహెచ్‌సీ మంజూరుతోపాటు రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తన తండ్రి కిల్లి వెంకటఅప్పలనాయుడు జ్ఞాపకార్థం రూ.కోటికిపైగా విలువ చేసే ఎకరా స్థలాన్ని విరాళంగా అందించారు.

పది నెలల్లో పనులు పూర్తి..

2023 ఏప్రిల్ 9న స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులుగా మీదుగా శంకుస్థాపన చేసి సుమారు 10 నెలల్లో భవనం పనులు పూర్తి చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులమీదుగా భవనం ప్రారంభానికి సిద్ధం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలుకు ప్రజలంతా జేజేలు పలుకుతున్నారు.

అభివృద్ధికి పెద్దపీట..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నారు. ఆరోగ్య రంగానికి ఎనలేని నిధులు కేటాంచి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. మండలానికి రెండో పీహెచ్‌సీ అవసరాన్ని గత ప్రభుత్వాలు విస్మరించాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పురుషోత్తపురానికి నూతన పీహెచ్‌సీ మంజూరుకు చర్యలు చేపట్టాం.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



నా చిరకాల కోరిక నెరవేరింది. నా సొంత గ్రామానికి శాశ్వతంగా గుర్తుండే పనిచేయాలని ఎప్పుడూ నా మనసులో ఉండేది. ప్రజలందరి ఆరోగ్యాలకు అవసరమైన పీహెచ్‌సీ మంజూరు కోసం స్పీకర్ తమ్మినేని సీతారాంను కోరాను. ఆయన సీఎం వైఎస్ జగన్ దృష్టిలో పెట్టి భవనం, నిధులు మంజూరు చేయించారు.

– కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, మండలప్రత్యేకాహ్వానితుడు, సరుబుజ్జిలి

క్లుప్తంగా

శ్రీశైలం మల్లన్న తలపాగా వస్త్రాల ఊరేగింపు



తలపాగా వస్త్రాలను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

పొందూరు: శ్రీశైలంలో కొలువైన భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి మహాశివరాత్రి పర్వదినాన సమర్పించేందుకు స్థానిక చేనేత వాడలో తయారు చేసిన తలపాగా వస్త్రాలను శుక్రవారం తిరువీధి నిర్వహించారు. అపారమైన భక్తి శ్రద్ధలతో స్వామిని కొలుస్తూ, ఉపవాస దీక్షలు చేస్తూ తలపాగా, వస్త్రాలను నేశారు. తిరువీధి అనంతరం వస్త్రాలను తయారు చేసిన అంకం ప్రసాద్ ఇంటికి చేర్చారు. తలపాగా వస్త్రాలకు భజనలు చేశారు. కార్యక్రమంలో చేనేత కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటుడు ప్రభాస్ శ్రీను



ఆదిత్యుని సన్నిధిలో ప్రభాస్ శ్రీను తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నటుడు ప్రభాస్ శ్రీను శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికార సిబ్బంది ఆయనకు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నానని, త్వరలో దర్శకుడు మారుతి ప్రభాస్ కాంబోలో చిత్రం విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, బీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 11 మంది ఎంపిక



అధికారులు, పరిశ్రమ ప్రతినిధులతో ఎంపికైన విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విశాఖపట్నం దువ్వాడ ప్రాంతానికి చెందిన సినర్జీ పరిశ్రమ శుక్రవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికల్లో 11 మంది విద్యార్థులను ఆఫీస్ అసిస్టెంట్లుగా ఎంపిక చేశారు. ఈ ఎంపికల్లో కమర్షియల్ ప్రాక్టీస్ విభాగానికి చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ఆధారంగా ఉద్యోగాల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు ప్రారంభంలో నెలకు రూ. 13,000 వేతనం అందజేయనున్నారు. కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఎంపిక ప్రక్రియ నిర్వహించగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు, సీనియర్ అధ్యాపకులు యుగంధర్, కామేశ్వరి పర్యవేక్షించారు.

26న చలో కలెక్టరేట్



టెక్కలిలో రైస్ మిల్లు కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధులు

టెక్కలి: రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు, కో కన్వీనర్ కె.సూరయ్య వెల్లడించారు. వారు శుక్రవారం పట్టణంలో గల పలు రైస్ మిల్లులను సందర్శించి కార్మికులకు కరపత్రాలు పంచి పెట్టారు. జిల్లాలో సుమారు 292 రైస్ మిల్లుల్లో 5 వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారని, వారంగా పని దోపిడీకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆయా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

25 మంది వ్యాపారులపై కేసులు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని రేషన్ షాపుల డీలర్లు వినియోగిస్తున్న 51 తూనిక యంత్రాలను స్థానిక ఎంఎల్ఎస్ కేంద్రంలో పలాస తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ కె.రాజారమేష్ శుక్రవారం తనిఖీ చేసి సీలు వేశారు. అలాగే కోటబొమ్మాళి, కొత్తపేట ప్రాంతాల్లో కిరాణా, ఎరువులు, పండ్లు, కూరగాయాలు, కూల్‌డ్రింక్స్, ఎలక్ట్రికల్ దుకాణాలు, ఇతర వ్యాపార కేంద్రాలనూ పరిశీలించారు. ఎంఆర్‌పీ, బరువు వ్యత్యాసాలు గుర్తించిన 25 మంది యజమానులపై కేసులు నమోదు చేశారు. ఎక్కడైనా తూనికల్లో వ్యత్యాసాలు కనిపిస్తే 9398124319 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వత్సవలస పిలుస్తోంది

- నేటి నుంచి వత్సవలస జాతర
- ఐదు వారాల పాటు రాజమ్మ తల్లి పండగ

గార: వత్సవలస గ్రామ దేవత శ్రీరాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) జాతర శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా రాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) అమ్మవారిని కొలుస్తున్న భక్తులు తమ తొలి సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకుంటారు. తెలంగాణతో పాటు ఉత్తరాంధ్ర నుంచి వేలాది కుటుంబాలు తమ ఇంటి దేవతగా రాజమ్మతల్లిని కొలుస్తుంటాయి. తమ ఇంటిదేవత కావడంతో మాఘమాసంలో ఆదిపీఠమైన వత్సవలస వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇంట్లో పుట్టిన వంశోద్ధారకుల తల వెంట్రుక (పుట్టుకొప్పు)లను ఇక్కడ అమ్మవారికి సమర్పిస్తుంటారు. శనివారం సాయంత్రం ఇక్కడకు విచ్చేసి ఆదివారం ఉదయం అమ్మవారికి మొక్కులు తీర్చుకొని తన వెంట తీసుకువచ్చిన కోళ్లు, గొర్రెలను సమర్పిస్తుంటారు. అనంతరం ఇక్కడే వంటలు చేసుకొని విందు ఆరగించి తిరిగి ఇంటిముఖం పట్టడంతో జాతర ముగుస్తుంది.

ఐదు వారాల పాటు..

గ్రామంలో సుమారు 25 పీఠాలుండగా, ప్రధానంగా ఐదు ప్రధాన పీఠాల వద్ద సంబరాలు జరుగుతుంటాయి. ఈ మాఘమాసంలో ఐదు వారాలు జాతర జరుగుతుండగా, వారానికి ఒక కుటుంబం వద్ద ఉన్న రాజమ్మతల్లి వద్ద పూజలు జరుగుతున్నా.. అన్ని పీఠాల వద్దకు భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారు. తొలి వారం మైలపల్లి శ్రీనివాస్‌దాసు పీఠంలో జరగనుంది.



ఆదిపీఠంలో ఈ వారం పూజలందుకోనున్న రాజరాజేశ్వరి దేవి

150 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..

యాత్రకు తొలివారం 150 మందితో పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ ఎల్.సన్యాసినాయుడు తెలిపారు. ఐదు వారాల పాటు వరుసగా శని, ఆదివారాల్లో శ్రీకాకుళం నుంచి వచ్చే వాహనాలను శ్రీకూర్మం కూడలి మీదుగా తూలుగు నుంచి వత్సవలస వరకు వన్‌వే ఏర్పాటు చేశామని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ప్రకటించారు. తిరుగు ప్రయాణంలో శ్రీకూర్మం మీదుగా శ్రీకాకుళం వెళ్లేందుకు వన్‌వే ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం



ఐదు వారాల పాటు ఈ ఏడాది యాత్ర జరగనుంది. తొలివారం మా పీఠంలో యాత్ర ప్రారంభమవుతుంది. మొక్కులు తీర్చుకునే భక్తులు కుటుంబ సమేతంగా ముందురోజు రాత్రి విచ్చేసి ఇక్కడే బస చేస్తారు. తాగునీరు, విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

– మైలపల్లి శ్రీనివాసదాసు, రాజమ్మతల్లి దాసుడు, వత్సవలస

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- జీవ నియంత్రణ ప్రయోగశాల ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జీవ నియంత్రణ ప్రయోగశాలను (బీసీ ల్యాబ్) శుక్రవారం ప్రారంభించారు. ముందుగా మార్కెట్ యార్డు ఆవరణలో మొక్కలు నాటి, వ్యవసాయ యంత్రాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు గ్రామాల్లోనే రైతుల వద్దకు అందించే విధానాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు అభివృద్ధి దిశలో పయనించాలని ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రంలో బీసీ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఈ ల్యాబ్‌లో రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, మట్టి నమూనాలను పరీక్షించుకోవచ్చునని సూచించారు. రైతులకు నకిలీల బారి నుంచి రక్షించడానికి ఈ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. బహిరంగ మార్కెట్‌లో రైతులు తమ ఎరువులను పరీక్షించాలంటే వేల రూపాయలతో కూడిన ఖర్చు అవుతుందని, పైసా ఖర్చు లేకుండానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ఫలితాలను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే మూడో జీవ నియంత్రణ ప్రయోగశాలను ఆమదాలవలసలో ఏర్పాటు చేసినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచితే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచేందుకు కొత్త ప్రాజెక్టులు తీసుకువస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర కృష్ణవేణి, మున్సిపల్ ఫ్లోర్ మాజీ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, ఏఓ మోహనరావు, నాలుగు మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.31.8కోట్లతో ఎస్‌కేఈ రోడ్డు అభివృద్ధి



ఎస్‌కేఈ రోడ్డు శిలాఫలకం ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్‌పర్సన్ పి.విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్

కవిటి: సోంపేట, కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ ప్రజలను అనుసంధానించే సోంపేట–కవిటి–ఈదుపురం రోడ్డు(ఎస్‌కేఈ) విస్తరణ, అభివృద్ధి చేపట్టడం ఇచ్ఛాపురం నియోజకవర్గ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ పని అని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. ఆమె శుక్రవారం రోడ్డును ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి అపరిష్కృతంగా మిగిలిన ఈ రోడ్డును రెండు లైన్ల రహదారిగా విస్తరించడం ఆనందదాయకమన్నారు. ఈ రోడ్డు అభివృద్ధి ద్వారా నాలుగు మండలాలకు చెందిన 3లక్షల మంది ప్రజలకు నిరంతరం రాకపోకలకు ఎంతో సౌకర్యం కలిగిందన్నారు.

కార్యక్రమంలో నేతలు కె.ప్రకాష్, ఎంపీపీలు డాక్టర్ దాస్, దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, ఇచ్ఛాపురం జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, దుక్క లోకేశ్వరెడ్డి, దేవరాజ్‌సాహూ, నేతాజీ, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, పి.శేఖర్, వై.అశోక్, ధర్మారావు, ఎం.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై టీడీపీ నేతల దాడి

పోలాకి: మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన దళిత యువకుడు జోగి శ్రీనివాసరావుపై అదే పంచాయతీ పరిధిలోని జిల్లేడుమాకివలసకు చెందిన టీడీపీ నాయకుడు గొల్లంగి వెంకటరావు అతని అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు శుక్రవారం పోలాకి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చీడివలస గ్రామంలో రెండురోజుల కిందట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో భవిష్యత్‌కు భరోసా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో ఎక్కడికక్కడ విద్యుత్ స్తంభాలకు పార్టీ జెండాలు కట్టారు. అందులో ఒక జెండా కింద పడిపోవడంతో.. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన జోగి శ్రీనివాసరావే దానికి కారణమని భావించి గొల్లంగి వెంకటరావు వర్గం జిల్లేడువలస నుంచి చీడివలస గ్రామానికి వచ్చి దాడికి దిగారని, కులంపేరుతో దూషించి, చంపేస్తామని హెచ్చరించినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

దళిత సంఘాల మండిపాటు

చీడివలసలో జోగి శ్రీనివాసరావుపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని దళితసంఘాల నాయకులు ఖండించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. బాధితుడు ఇంటింటికీ రేషన్ వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంటే అది చూసి తట్టుకోలేని పెత్తందార్లు ఇలాంటి దాడులకు దిగటం హేయకరమైన చర్య అని అన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఇలాంటి దాడులు జరగకుండా చూడాలని పోలీసులను కోరారు. పోలీసులను కలిసిన వారిలో నాయకులు బెలమాన గడ్డెయ్య, పి.గోపాల్ తదితరులు ఉన్నారు.

‘యువతే దేశ భవిత’



విజేతకు బహుమతి అందజేస్తున్న వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: దేశం ప్రగతి సాధించాలంటే యువత పాత్ర కీలకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం యువ సంవాద్–2047 అన్న అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ భారత దేశం తప్పకుండా 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ దేశంగా మారుతుందన్నారు. దేశం అభివృద్ధి సాధించాలంటే మానవ వనరుల సద్వినియోగం, సాంకేతిక ప్రగతి, అవినీతి నిర్మూలన, పారిశ్రామిక ప్రగతి, విద్యలో సంస్కరణలు తప్పనిసరని తెలిపారు. విద్యార్థులు విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తమ చుట్టూ ఉన్న సమాజ మార్పు కోసం జాతీయ సేవా పథకం వలంటీర్లు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులకు దేశ ప్రగతికి సంబంధించిన అంశాల్లో పలు పోటీలు నిర్వహించగా డిబేట్‌లో ఎంబీఏ విద్యార్థులు పి.చైతన్య, వి.రాజకుమారి, ఇలస్ట్రేషన్‌లో కెమిస్ట్రీ విద్యార్థి ఎల్.పావని, ఇంజినీరింగ్ విద్యార్థి డి.దుర్గాభవాని, వ్యాసరచనలో ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్థి పి.ఢిల్లీశ్వరరావు, ఎంబీఏ విద్యార్థి పి.జశ్వంత్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, జాతీయ సేవాపథకం సమన్వయ కర్త అనురాధ, ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీ నాయకులు టి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

‘పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోండి’



పుస్తకప్రదర్శన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, పీఎల్‌పీ భారతి, లెక్చరర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓ మంచి పుస్తకం, మంచి స్నేహితునితో సమానమని, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పిలుపునిచ్చారు. కళాశాల గ్రంథాలయంలో శుక్రవారం లైబ్రేరియన్ పి.లక్ష్మీప్రసన్న భారతి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్నో విలువైన పుస్తకాలు ఉన్నాయని, విద్యార్థులకు పుస్తకాల విలువ తెలిసినప్పుడే వాటిపై మమకారం పెరుగుతుందన్నారు. గ్రంథాలయంలో ఉన్న పలు పుస్తకాలను అధ్యాపకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ చింతాడ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అధ్యాపకులు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

25న పుస్తక పరిచయ సభ

శ్రీకాకుళం కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఈనెల 25న ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి, సృజన క్రాంతి పత్రిక సాహిత్య సంపాదకులు కొమ్మవరపు విల్సన్‌రావు కవితాసంపుటి ‘నాగళి కూడా ఆయుధమే’ పుస్తక పరిచయం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్, కవి కంచరాన భుజంగరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ సభకు ముఖ్య అతిథులుగా కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు, నవమల్లిక సాహిత్యపత్రిక సంపాదకు లు కలిమిశ్రీ హాజరవుతారని చెప్పారు. విశాఖ నుంచి ప్రముఖ కవి కె.జి.వేణు, అంబేడ్కర్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్‌లు పుస్తక పరిచయ ప్రసంగాలు చేస్తారని పేర్కొన్నారు. ఈ సభ ఉదయం 9.30గంటలకు ప్రారంభమవుతుందని, కవులు రచయితలు, మేధావులు హాజరుకావాలని కోరారు.

సాగుకు సలహా సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న గొండు రఘురాం

శ్రీకాకుళం, పాతబస్టాండ్: మత్స్యశాఖపై మండల స్థాయిలో చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు గొండు రఘురాం సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పార్లమెంటు నిధులతో త్వరితగతిన అవుతున్నాయని, అలాగే రాజ్యసభ నిధులతో కూడా త్వరగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అధిక దిగుబడులు ఇచ్చే మేలైన కొబ్బరి రకాలు, టిష్యూ కల్చర్ గల అరటి రాయితీపై పంపిణీ చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణకు అవసరమైన రకాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చించారు. మార్క్ ఫెడ్ ద్వారా ఫెర్టిలైజర్స్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఏ రాష్ట్రంలోనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయడం లేదన్నారు. పశు సంవర్ధక శాఖ జేడీ కిశోర్ కుమార్ మాట్లాడుతూ పశువులకు సంబంధించి హెల్త్ కార్డులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, అవార్డు కూడా అందుకున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి వ్యవసాయ సలహా బోర్డు జేడీని అభినందించింది. మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ ఏడీలు ఆయా శాఖల్లో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రైతు అప్పలనాయుడు మాట్లాడుతూ అదపాక పంచాయతీలో ఇన్‌చార్జ్ లేకుండా శాశ్వతంగా ఉండే వ్యవసాయ అధికారులను నియమించాలని కోరారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణకు సంబంధించి చెల్లింపులు కొద్ది మొత్తంలో ఇవ్వాల్సి ఉందన్నారు. వంశధార, మడ్డువలస రిజర్వాయర్లపై నీటిపైన ఎస్ఈలు డోల తిరుమలరావు, సుధాకర్ చర్చించారు. సమావేశంలో సభ్యులు గొండు రఘురాం, డీసీఎంఎస్ అధ్యక్షుడు గొండు కృష్ణమూర్తి, వంశధార, మడ్డువలస ఎస్ఈలు డోల తిరుమలరావు, సుధాకర్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ జేడీ కిశోర్, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, సభ్యులు, రైతులు, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిద్రమత్తు



మృతుడు నిడమనూరు రామకృష్ణ(ఫైల్)

కంచిలి: డ్రైవర్ అజాగ్రత్తతో ఒక నిండు ప్రాణం బలైంది. కంచిలి మండలం జాడుపూడి కాలనీ వద్ద జాతీయ రహదారిపైన శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నిడమనూరు రామకృష్ణ (39) అనే వ్యక్తి మృతి చెందారు. విజయవాడ నుంచి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పరిధి దుర్గాపూర్‌లో పాత పొక్లెయినర్ అమ్మకానికి ఉందని తెలుసుకొని విజయవాడకు చెందిన నిడమనూరు రామకృష్ణ, సయ్యద్ సికిధర్‌లు కారులో బయల్దేరారు. కారు నడుపుతున్న డ్రైవర్ రాఘల శేషుబాబు శుక్రవారం వేకువజామున నిద్రమత్తుతో అజాగ్రత్తగా నడపడంతో రోడ్డు సెంటర్ డివైడర్‌ను ఢీకొట్టి, అదే వేగంలో అవతలి రోడ్డుకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే అంబులెన్స్‌లో బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కారులో ప్రయాణిస్తున్న సయ్యద్ సికిధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కారు నడుపుతున్న డ్రైవర్ బాపట్ల జిల్లా తిప్పాలకట్ట గ్రామానికి చెందిన రాఘల శేషుబాబుపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పి.అప్పలరెడ్డి తెలిపారు.

రిమ్స్ ఉద్యోగిపై యువకుడి దాడి



ధర్నా చేస్తున్న రిమ్స్ ఉద్యోగులు

శ్రీకాకుళం: నగరంలోని రిమ్స్ ఉద్యోగిపై ఓ యువకుడు తాగిన మైకంలో దాడికి పాల్పడ్డాడు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో రాకేష్ అనే యువకుడు కాలికి గాయమై రిమ్స్‌కు వెళ్లాడు. ఆ సమయంలో అత్యవస విభాగంలో ఉద్యోగులంతా ఓ ప్రమాద కేసుకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఉద్యోగులందరూ చికిత్స పనిలో ఉండగా, రాకేష్ తనకు వెంటనే వైద్యం చేయాలని పట్టుబట్టి దుర్భాలాడినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బూతులు తిడుతూ సిబ్బందికి పైకి వెళ్లగా రాత్రి డ్యూటీలో ఉన్న ఆర్ఎంఓ డాక్టర్ భానుప్రకాష్ రాకేష్‌ను వారించేందుకు ప్రయత్నించారు. ఆయనపై కూడా దురుసుగా వెళ్లడంతో రాంబాబు అనే రిమ్స్ ఉద్యోగి రాకేష్‌ను ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా, రాకేష్ మద్యం మత్తులో రాంబాబుపై దాడిచేశాడు. ఆ సమయంలో ఉన్న సెక్యూరిటీ గార్డులు కూడా నిలువరించేందుకు ప్రయత్నం చేయకపోగా, ఔట్‌పోస్టు పోలీసులకు కొందరు రోగులు సమాచారం అందించారు. ఆ తర్వాత కూడా రాకేష్ ఆస్పత్రిలో దుర్భాలాడుతూ తిరిగినట్టు, ఉద్యోగిపై దాడిచేసినట్టు ఔట్‌పోస్టు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు శుక్రవారం ఉదయం సుమారు గంట సేపు విధులను బహిష్కరించి దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంఓ భానుప్రకాష్‌తో పాటు బాధితుడు రాంబాబు రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భేతాళపురంలో అక్రమ మద్యం స్వాధీనం



భేతాళపురం ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఒడిశా మద్యం

మందస: మండలంలోని భేతాళపురం గ్రామంలో శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో నిర్వహించిన ఈ దాడుల్లో ఒడిశా నుంచి తీసుకువచ్చి అమ్ముతున్న 96 బీర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని అమ్ముతున్న కదంబాల చంద్రశేఖర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు సీఐ జైభీమ్ శ్రీకాకుళం ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. అనంతరం సీఐ జైభీమ్ విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా నాటుసారా, మద్యం అమ్మకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా విక్రయించే వారి వివరాలను 9440902358 అనే నంబరు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో శ్రీకాకుళం ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ కూర్మారావు, సోంపేట సెబ్ ఎస్ఐ వై.చంద్రమోహన్ పాల్గొన్నారు.

రెండు రైస్‌మిల్లుల్లో చోరీ



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి, పోలీసులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని రెండు రైస్‌మిల్లుల్లో గురువారం రాత్రి దొంగలు రూ.50 వేల నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంగలు తొలుత సూర్యమిత్ర రైస్‌మిల్లులో వాచ్‌మెన్ నిద్రలో ఉండగా వెనుక మార్గం ద్వారా జొరబడ్డారు. అక్కడ బీరువాలో ఉంచిన రూ.40వేలు చోరీ చేశారు. అనంతరం సీతారామ రైస్‌మిల్లులో జొరబడి రూ.10వేలు పట్టుకుపోయారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మహ్మద్ అలీ ఘటన స్థలాలను పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు.

సాక్షి క్లాసిఫైడ్స్

CORRECTION OF DATE OF BIRTH

I, Simhachalam Boddu, S/o Lakshminarayana, Army No - 15710071N Rank - Hav, Resident of D No : 2-19, Sukhadevpeta (vill), Tekkali (Post/MD), Srikakulam (Dist), Andhrapradesh. My wife Boddu Dhanalakshmi, Date of Birth has been wrongly recorded as 18-07-1995 in my service records. As such her correct Date of Birth is 18-07-1997.

GODOWNS FOR LEASE

Lease, Godowns-PEB Structure Suitable for MSME, Stock points Hospitals, Logistics, Abutting to Highway, Etcherla, Srikakulam. Ph: 94414 40553 [S-189785]

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

WANTED

ఏకలవ్య ఫౌండేషన్, FPO కోఆర్డినేటర్-1, కొత్తూరు మండలం శ్రీకాకుళం. Qly: Any డిగ్రీ, M.S.Office, Salary: 20,000/-, Required Own Bike, Android Phone. Cont: 9666656261 [S-189795]

కష్టమైన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 9014885406. [HA-1261]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9160900024 / 9640400073 [HA-1254]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.